న్యూస్‌రీల్

ఓడీఎఫ్ గ్రామంగా ఎలకేశ్వరం



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు(ఫైల్)

భీమారం: జిల్లాలో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా భీమారం మండలంలోని ఎలకేశ్వరం ఎంపికైనట్లు సర్పంచ్ సమ్మయ్య శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 2022 జూన్ నెలలో స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ)సెంట్రల్ టీం సభ్యులు గ్రామాన్ని సందర్శించినట్లు, వందశాతం మరుగుదొడ్లు, ఇంటింటికీ ఇంకుడుగుంతతో పాటు డంపింగ్‌యార్డులను సద్వినియోగం చేసుకోవడాన్ని పరిశీలించి ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ఎంపికచేసినట్లు తెలిపారు. ప్రజలకు, అధికారులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో జోబిన్, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు క్యాట్ (నాలెడ్జ్, అసెస్‌మెంట్ టెస్ట్)లో లెవల్–2లో 78మంది ప్రతిభ కనబరిచారు. ఇందులో 8మంది విద్యార్థులు నగదు పురస్కారానికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోబిన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న రాజేశ్వర్

జన్నారం: మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్(శౌచాలయాలు) నిర్మించాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట టీడీపీ పార్లమెంటరీ కార్యదర్శి తాళ్లపెల్లి రాజేశ్వర్ నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఎంపీపీ సరోజన, ఎంపీడీవో అరుణరాణి, ఏఎంసీ చైర్మన్ పద్మ, మహిళ ఎంపీటీసీలు అక్కడికి వచ్చి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ వారికి వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి వెంటనే టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం తడి, పొడి చెత్త నిర్వహణ, మన బాధ్యతపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో జరిగిన పోటీల వ్యాసరచనలో ఠాకూర్ జితేందర్‌సింగ్, వరుణతేజ, ఉపన్యాస పోటీల్లో అజయ్, పి.వరుణ్‌తేజ ప్రతిభ కనబరిచి మండలస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం దుర్గయ్య, ఉపాధ్యాయులు యోగేశ్వర్, ఉదయ్ పాల్గొన్నారు.

27న ధర్నా

బెల్లంపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట ధర్నా చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రంజిత్‌కుమార్ తెలిపారు. బెల్లంపల్లి సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు.

నర్సరీల సందర్శన



భీమారం/కాసిపేట: భీమారం మండలంలోని కొత్తపల్లి, ఎలకేశ్వరం గ్రామపంచాయతీల్లోని నర్సరీలను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సతీష్‌రెడ్డి సందర్శించారు. కాసిపేట మండలంలోని పల్లంగూడ, కోమటిచేను, బుగ్గగూడ గ్రామపంచాయతీల్లోని నర్సరీలు, పల్లెప్రకృతివనాలను ఎంపీడీవో ఎం.ఎ.అలీం తనిఖీ చేశారు. మొక్కలకు నీటిని అందించి కాపాడాలని సూచించారు. బుగ్గగూడలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని చేసి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



ఆదిల్‌పేట్‌లో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

చెన్నూర్: పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, వైద్యురాలు అరుణశ్రీ సందర్శించారు. ఎంత మందికి పరీక్షలు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పుట్ట సత్తయ్య, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, మెప్మా సభ్యురాళ్లు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో నిర్వహిస్తున్న కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల శుక్రవారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరికరాలను నమోదు చేస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ శ్రీహరి, వైద్యాధికారి సతీస్‌కుమార్, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి, కాచన్‌పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీవో టి.శ్రీనివాస్ పరిశీలించారు.

కాసిపేట: మండలంలోని గట్రావ్‌పల్లి, బుగ్గగూడం, పల్లంగూడ గ్రామాల్లో వైద్య కేంద్రాలను ఎంపీడీఓ ఎం.ఏ.అలీం పరిశీలించారు. రోగులకు అవగాహన కల్పించి కంటి పరీక్షలకు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

తాండూర్: మండలంలో నిర్వహిస్తున్న కంటి వెలుగును డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూర్ణిమ తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్‌లో నిర్వహిస్తున్న శిబిరాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి సందర్శించారు. వైద్యాధికారి శివప్రతాప్, ఎంపీడీవో శశికళను సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంగ, జెడ్పీటీసీ రవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో భీరయ్య సర్పంచ్‌లు కార్యదర్శులు ఉన్నారు.



తాండూర్: కంటి వెలుగు శిబిరంలో విజయపూర్ణిమ



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



చెన్నూర్‌లో కంటి వెలుగును సందర్శించిన అధికారులు

రోడ్డు నిబంధనలు పాటించాలి



షేక్‌బాబాను సన్మానిస్తున్న శ్యాంనాయక్, ఎమ్మెల్యే

జన్నారం: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రైవేట్ వాహనాల ఓనర్స్ అసోసియేషన్ సమ్మేళనానికి ఎమ్మెల్యే రేఖానాయక్, శ్యాం నాయక్ హాజరయ్యారు. 15సంవత్సరాలుగా అసోసియేషన్ అధ్యక్ష బాధ్యతలు చేపడుతున్న షేక్ బాబాను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల వరకు వెళ్తూ ప్రజలను గమ్యస్థానాలకు తీసుకెళ్లడంలో ప్రైవేట్ వాహనాల యజమానులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల పత్రాలు కలిగి ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఉప సర్పంచ్ శ్రీనివాసగౌడ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 41మంది లబ్ధిదారులకు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పంపిణీ చేశారు. ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో మున్సిపాలిటీ పరిధిలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ అన్నం మంగ, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, తహసీల్దార్ జ్యోత్స్న పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట అంజలి ఫిల్లింగ్ స్టేషన్ యజమాని దొంత నర్సయ్య ఆధ్వర్యంలో తలమల, మన్నెగూడ, పోచంపల్లి గ్రామాల్లోని నిరుపేదలకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ సౌజన్య

బెల్లంపల్లి: మహిళలు ఏటా క్రమం తప్పకుండా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని ఓ ప్రైవేట్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు సౌజన్య తెలిపారు. బెల్లంపల్లిలోని సత్యసాయి సేవా సదనంలో తెలంగాణ రాష్ట్ర శ్రీసత్యసాయి సేవా సంస్థల మహిళ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. క్యాన్సర్ మొదటి దశలో పరీక్ష చేయించుకుంటే, వ్యాధి నిర్ధారణ జరిగితే చికిత్స చేయించుకుని సాధారణ పరిస్థితికి వచ్చే అవకాశాలు ఉంటాయని సూచించారు.

ఇంకుడు గుంతలు పునరుద్ధరించండి | అటెన్షన్ ప్లీజ్..



భీమారం: వర్షపు నీరు వృథా పోకుండా భీమారం మండలంలోని అడవుల్లో జంతువులకు నీరందించడానికి, భూగర్భ జలమట్టం పెరిగాలన్న సదుద్దేశంతో ఇంకుడు గుంతలు నిర్మించగా, ప్రస్తుతం మట్టి పూడికతో నిండిపోయాయి. తిరిగి వాటిని మళ్లీ తవ్వించాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: రమేశ్, ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్, మంచిర్యాల ఫోన్ నంబర్: 9550991984

గిరిజన గ్రామానికి నీరందించండి..!

- ఎమ్మెల్యేను వేడుకున్న సర్పంచులు



ఆర్‌డబ్ల్యూఎస్ జేఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ హాజరై సమస్యలపై అధికారులను నిలదీశారు. మారుమూల గిరిజన గ్రామానికి నీరందించాలని చాలా సార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచులు సుమలత, విజయ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చేతిపంపులు చెడిపోయాయని, భగీరథ నీరు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నీరు ఎందుకు రావట్లేదని, ప్రతి గ్రామానికి నీరు వచ్చేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పలు గ్రామాల్లో యువకులు గంజాయికి బానిసలై చెడిపోతున్నారని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎస్సై సతీశ్, ఎక్సైజ్ ఎస్సై రాబర్టులను గంజాయిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హజరైన ఐటీడీఏ, ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ అధికారులపై ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో అరుణరాణిని ఆదేశించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పద్మ, ఎంపీడీవో అరుణరాణి, ఎంఈవో విజయ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: అడవులు, సరస్సులు, నదులు, సహజసంపద, పచ్చదనంతో కూడిన పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణ మన బాధ్యత అని కలెక్టర్ భారతి హోళ్లీకేరి అన్నారు. జంతుహింస నివారణ సంఘం రూపొందించిన కరపత్రాలు జిల్లా పశు సంవర్ధశాఖ సంయుక్త సంచాలకులు రమేశ్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు.

టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ మంచిర్యాల జిల్లా క్యాలెండర్, డైరీని జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, అటవీశాఖ టీఎన్జీవోస్ సెంటర్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమ్మేళనం

చెన్నూర్‌రూరల్: మండంలోని ఆస్నాదలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు 12 గ్రామాల పరిధిలో శుక్రవారం బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పలువురు సూచించారు. ఎంపీపీ బాపు, జెడ్పీటీసీ తిరుపతి, మాజీ జెడ్పీటీసీ కరుణసాగర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గ్రీన్‌ఫ్రైడే'

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర, కిష్టంపేట గ్రామాల్లో శుక్రవారం 'గ్రీన్‌ఫ్రైడే' కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో చెత్త, చెదారం శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

స్వీయ రక్షణతో పని చేయాలి

- సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి విధి నిర్వాహణలో స్వీయ రక్షణతో పని చేయాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఎస్సార్పీ 3గనిపై పని స్థలాల్లో ఉద్యోగులు వ్యక్తిగత భద్రత, బాధ్యతలపై శుక్రవారం అవగాహన పక్షోత్సవాలు నిర్వహించారు. ప్రతి ఉద్యోగి రక్షణ నియమాలు పాటిస్తూ సొంతంగా తనను తాను పరిరక్షించుకుంటూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి గోషిక మల్లేశ్, ఏజెంట్ గోపాల్‌సింగ్, సిమ్‌టార్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, గని ఇన్‌చార్జి మేనేజర్ మహేందర్, డెప్యూటీ మేనేజర్ చంద్రముర్తి, అధికారులు ప్రేంకుమర్, అరుణ్‌కుమార్, టీబీజీకేఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాలు విడుదల

శ్రీరాంపూర్: ఈ నెల 29న కొత్తగూడెంలో జరిగే సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) 7వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు డీ బ్రహ్మానందం ఈ పోస్టర్లను విడుదల చేశారు. ఈ మహాసభలకు కాంట్రాక్ట్ కార్మికవర్గం తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కిరణ్, అప్పారావు, అంకూశ్, సుధాకర్, రాంబాబు, శంకర్, ఈశ్వరారావు పాల్గొన్నారు.

గని ఆవరణలో మ్యాగ్జిన్ ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3గనులకు సంబంధించి ఒకటే మ్యాగ్జిన్(ఎక్స్‌ప్లోజివ్స్ గది) ఉందని దీని వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సీఐటీయూ నాయకులు జీఎం సంజీవరెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. రెండు గనులకు వాటి ఆవరణలోనే ప్రత్యేకంగా మ్యాగ్జిన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి భాగ్యరాజ్, నాయకులు శ్రీనివాస్, మొగిలి పాల్గొన్నారు.

కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేత



ఉద్యోగ నియామకపత్రాలు పొందిన అభ్యర్థులు

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో క్రమ శిక్షణతో పనిచేస్తేనే మంచిగుర్తింపు వస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. 39మందికి శుక్రవారం కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు ఆయన అభ్యర్థులకు అందించారు. సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని, గైర్హాజరు లేకుండా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పీఎం రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు, డెప్యూటీ సూపరిండెంట్ రాజయ్య పాల్గొన్నారు.

శాంతిఖని గనిని సందర్శించిన ఏరియా ఇంజనీర్



గనిలో దిగేందుకు సిద్ధమైన అధికారులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిని శుక్రవారం కొత్తగా బదిలీపై వచ్చిన ఏరియా ఇంజనీర్ సందర్శించారు. ఏరియా జీఎం(డీవైజీఎం) జే.నాగరాజు సబ్‌స్టేషన్‌ను ఆ తర్వాత శాంతిఖని భూగర్భంలో దిగి పంపులను పరిశీలించారు. వాటి పని తీరును అడిగి తెలుసుకున్నారు. డీవైజీఎం వెంట శాంతిఖని గ్రూప్ ఆఫ్ మైన్స్ ఇంజనీర్ బసవరాజు, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, రక్షణ అధికారి రాజు, ఫిట్ ఇంజనీర్ రాంబాబు, ఇంజనీర్లు సైదులు, రాంసాగర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో ఉమాదేవి

బెల్లంపల్లి: హక్కులు, చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ బెల్లంపలి సీడీపీవో ఉమాదేవి అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారతరాజ్యాంగం ఆడపిల్లల కోసం ప్రత్యేక చట్టాలు చేసిందని, ఆ చట్టాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హక్కులు, చట్టాలతో సమానంగా బాధ్యతలు కూడా స్వీకరించాలని వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతి, మమత, ప్రభావతి, ప్రిన్సిపాల్ స్వరూప, కళాశాల సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



దండేపల్లి: దండేపల్లి, లింగాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో శనివారం ఉదయం 10–30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాయనర్సు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132కేవీ లైన్ల మరమ్మతు దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు సాయంత్రం 5గంటల వరకు దండేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపేట, తానిమడుగు ఫీడర్లకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో 1985పదో తరగతి బ్యాచ్ నుంచి 2021పదో తరగతి బ్యాచ్‌లకు చెందిన సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు, 200మంది ఉపాధ్యాయులతో ఫిబ్రవరి 12న పాఠశాల మైదానంలో 'మహాసమ్మేళనం–మహా ప్రయోజనకరం' అనే నినాదంతో మహా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్తలు కే.వాణిశ్రీ, సి.రాజారెడ్డి కోరారు. ఈ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ్మేళనానికి సంబంధించిన కోర్ టీం సభ్యులతో పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ, విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరు కాబోతున్నట్లు వివరించారు. ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ఉపయోగపడేలా చారిట్రబుల్ ట్రస్ట్‌ని ఏర్పాటు చేసి, దానిని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు విష్ణువర్ధన్, శారద, శంకర్, సమ్మయ్య, మైదం రామకృష్ణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.